



గదిలో గువ్వదీపం భయం భయంగా వెలుగుతోంది. మంచంమీద రాజారావు గుండెల్లో బాధ సన్నగా మండుతోంది. మంచంపక్క నేలమీద పరచిన చాపమీద బాబిగాడ్ని డొక్కలోకి లాక్కున్న వరలక్ష్మి వెక్కుతోంది. బాధలరూపం తెలియని బాబిగాడుమటుకు తల్లి గుండెల్లో తల దూర్చి నిద్దరోతున్నాడు.

గువ్వదీపం చుట్టూ పురుగు తిరుగుతోంది. రాజారావు కళ్ళలో ఆవేశం తరవాత చల్లని మంట సుళ్ళు తిరుగుతోంది. వరలక్ష్మి కడుపులో ఆక్రోశం ఉంగలు చుట్టుకొని డొక్కల్ని కుదుపుతోంది.

*　　*　　*

రాజారావు ఏనిమల్ హజ్బెండరీ డిపార్ట్‌మెంటులో ఎనిమిదేళ్ళుగా ఎల్డీసీ. కలలు కనే వయసులోనే అవన్నీ కలలే అని తెలుసుకొని దొరికిన ఎల్డీసీ ఉద్యోగాన్ని అందిపుచ్చుకుని, సర్వీస్ కమిషన్ అయిందనిపించుకుని రాజీపడ్డ జీవితంలో స్థిరపడిపోయాడు. ఆదర్శాలు వల్లించక పోయినా తనలాంటివాడే అయిన తండ్రి స్నేహితుడి కూతురైన వరలక్ష్మిని ఆయనిచ్చిన తృణమే స్వీకరించి, తోడుగా తెచ్చుకున్నాడు. ఆ తరవాత చెల్లెలికి పెళ్ళిచేసి అన్నగా తన బాధ్యత పూర్తిచేశాడు.

ఊళ్ళోవున్న పెంకుటింట్లో ట్యూషను చెప్పుకుంటూ తండ్రి తల్లితో మిగిలిపోతే, పట్నంలో వరలక్ష్మితో కలిసి రెండు వేళ్ళూ నోట్లోకి పోతుంటే జీవితం గడిపేస్తున్నాడు.

చెల్లెలి పెళ్ళికోసం, ఆపైన ఆనవాయితీల కోసం పి. ఎఫ్. లోను. ఫెస్టివల్ లోనూ మొదలైనవి చాలక, ఎష్టాబ్లిష్‌మెంట్ సెక్షన్‌లోవున్న సుబ్బారావుద్వారా కాబూలీవాడిదగ్గర అప్పు తీసుకున్నాడు. అప్పట్నించీ రెండువేళ్లూ నోట్లో పెట్టుకోడానికి రాజారావుకి భయంగా వుంది.

సుబ్బారావంటే రాజారావుకి ఒక విధమైన అసూయ. దానితోపాటు ఎడ్మిరేషన్ వున్నాయి. సుబ్బారావుదగ్గరకి చాలామంది చాలా పనులకోసం వస్తూ వుంటారు. సుబ్బారావు ఫారిన్ బట్టలుతెచ్చి ఇన్‌స్టాల్‌మెంట్స్‌మీద అమ్ముతూవుంటాడు. తరచు బార్‌కి వెడుతూ వుంటాడు. పేకాట ఆడతాడు. రేసుల కెళతాడు. అతని దగ్గర ఎప్పుడూ వందరూపాయలైనా వుంటాయి. స్టాఫ్ అసోసియేషన్‌కి జనరల్ సెక్రటరీ. నాటకాలేస్తాడు. ఒకటి రెండు కల్చరల్ ఆర్గనైజేషన్స్‌లో సభ్యత్వంకూడా వుంది. అతనెప్పుడు జర్దా పాన్ నములుతూ వుంటాడు. నవ్వుతూవుంటాడు. ఆఫీసు కొస్తూనే అందరినీ పలకరిస్తాడు. అవసరం వచ్చినప్పుడు అడపా దడపా చేబదుళ్ళిచ్చి జాగ్రతగా వసూలు చేసుకుంటాడు. అవ్వుడప్పుడు అతనిపై ఆఫీసర్లుకూడా అతని దగ్గర డబ్బు వాడుకుంటూ వుంటారు.

---

ఆశల రెక్కలను నమ్ముకుని అసలు రెక్కలను విరుచుకో కూడదు. గుండెకు; మరో గుండె తోడు; గుండె గువ్వకు రెండు రెక్కలు!

---

సుబ్బారావంటే రాజారావుకి ఎందుకో భయంగా, గౌరవంగా వుంటుంది. సుబ్బారావుతో మాట్లాడుతున్నప్పు డెప్పుడూ రాజారావతని కళ్ళల్లోకి చూడడు. సుబ్బారావు మాట్లాడుతోంటే ఏదో అతీతమైన శక్తి తనచుట్టూ పురి విప్పుతున్నట్టు వుంటుంది రాజారావుకి. అయినా రాజారావు ఇన్ డైరెక్ట్లీ వర్షిప్స్ సుబ్బారావు.


కాబూలీవాడి దగ్గర రాజారావు అప్పు తీసుకున్నప్పుడు, సుబ్బారావే హామీగా వున్నాడు. వాడి తరపున వడ్డీ డబ్బులు అప్పుడప్పుడు సుబ్బారావే వసూలు చేస్తూ వుంటాడు.

సుబ్బారావు చేసేది తనలాంటి ఉద్యోగమే అయినా అంతహాయిగా ఎలా వుండగలుగుతున్నాడో రాజారావుకి పజిల్‌లా వుంటుంది.

కాబూలీవాడు వచ్చినప్పుడల్లా రాజారావుకి కాళ్ళలో వణుకు పుడుతుంది. పరిగెత్తుకుంటూ వెళ్ళి, ఎంత పనిలోవున్నా సుబ్బారావుని కూడా తీసుకొచ్చి కాబూలీవాడికి వడ్డీ ఇస్తాడు. కాబూలీవాడి దగ్గర అప్పు తీసుకుని ఏణ్ణర్థం దాటింది. వడ్డీ తప్ప అసలెప్పుడూ తీర్చలేకపోతున్నాడు రాజారావు. ఈ విషయం వరలక్ష్మితో చెప్పలేదు. జీతంలో ఆఫీసు లోన్లు కోపేస్తున్నా రనుకుంటోంది.

నిన్నటి రోజు వడ్డీ ఇస్తున్నప్పుడు అసలు కూడా కొంత ఇవ్వమని పట్టుబట్టాడు కాబూలీ. రాజారావుకి ముచ్చెమట్లు పోశాయి. మాట్లాడలేకపోతున్న రాజారావుని చూసి. "తొందరపెట్టకండి ఖాన్ సాబ్, మీ వడ్డీ ముడుతోందిగా, తీరుస్తాడులెండి నేను మధ్యనున్నాగా." అన్నాడు సుబ్బారావు.

"నయ్ సాబ్" అంటున్న కాబూలీని సర్ది పంపేసి. రాజారావు భుజం మీద చెయ్యేసి ఎదురుగా కాంటీన్‌లోకి నడిచాడు సుబ్బారావు.






ప్రపంచ ప్రఖ్యాత 'ధ్వన్యనుకరణ సమ్రాట్' డాక్టర్ నేరెళ్ళ వేణుమాధవ్ మిమిక్రీ కళ గురించి వారి అనుభవపూర్వకమైన పాఠాలను యువజనులను ప్రోత్సహించడం కోసం 'మిమిక్రీ లెసన్స్'గా వారం వారం చెప్పడానికి అంగీకరించారని, ఈ శీర్షికను వచ్చే సంచిక నుంచి ప్రారంభిస్తున్నామని తెలియజేయడానికి ఆనందిస్తున్నాము.

—ఎడిటర్

సర్వర్ రెండు కప్పులు టీ తీసుకొచ్చి టేబిల్ మీద పెట్టాడు. రాజారావు తలవంచుకు కూర్చున్నాడు. అతనికి నెత్తిమీద ఒక టన్ను బరువు పెట్టినట్టుగా వుంది. సిగరెట్టు వెలిగించుకుంటున్న సుబ్బారావు, టేబిల్లోకి తలదూర్చడానికి సిద్ధంగావున్న రాజారావుని చూసి నవ్వుకున్నాడు,

టీ రాజారావు ముందుకు జరిపి, "తీసుకోవోయ్ రాజారావ్. ముందు టీ తాగి తరవాత ఆలోచించు. తేనీరు తేటతేట ఆలోచనల్ని కలిగించును" అన్నాడు సుబ్బారావు.

ప్రయత్నించినా నవ్వురాని రాజారావు టీ అందుకున్నాడు. ఏం చెయ్యాలో తెలియక,

టీ తాగడం పూర్తయ్యాక, "ఇప్పుడు చెప్పు రాజారావ్. ఖాన్‌కి ఎంతివ్వాలి." అన్నాడు సుబ్బారావు.

"మీకు తెలుసుగదా సుబ్బారావుగారూ" మర్చిపోయాను. ఎన్ని గుర్తుపెట్టుకోగలను సారీ."

"రెండు వేలు"

"అబ్బా, మీ పరిస్థితిలో కష్టమే" అన్నాడు సుబ్బారావు సిగరెట్టు పొగ వదులుతూ.

"అదేనండి ఏంచెయ్యాలో తెలియటం లేదు" అన్నాడు రాజారావు వుక్కిరిబిక్కిరవుతూ.

"వాడీ నెల కాకపోతే ఇంకో రెండు, మూడు నెలల్లోనైనా తీర్చకపోతే ఊరుకునేలా లేడు."

ఏం చెప్పాలో తెలియని రాజారావు తలవంచుకు కూర్చున్నాడు.

"చూడు రాజారావ్. పరిస్థితులు ఎదురుతిరిగినప్పుడు ముడుచుకు కూర్చుంటే ఏమీ ప్రయోజనం లేదు ఏదో ఒకటి సాహసించాలి. "నేను నీ అప్పు తీర్చలేను. ఇప్పటివరకూ నీకిచ్చిన వడ్డీ అసలుకన్నా ఎక్కువేవుంది. ఏంచేస్తావో చేసుకో" అని ఖాన్‌తో చెప్పగల ధైర్యం నీకుందా" అన్నాడు సుబ్బారావు కొద్దిగా తలపైకెత్తి రాజారావుని చూస్తూ.

రాజారావు కుర్చీలో బిగుసుకుపోయాడు.

సుబ్బారావు కనిపించకుండా నవ్వుకున్నాడు

"ఏ పనైనా చెయ్యడానికి ధైర్యం కావాలి రాజారావు. ఖాన్‌ని యెదిరించాలంటే అవసరమైతే అతనితో దెబ్బలాడటానికి సిద్ధంగా వుండాలి. రెడీయేనా" అన్నాడు సుబ్బారావు. రాజారావు కేసి సూటిగా చూస్తూ.

రాజారావునోట్లోంచిమాటరావటంలేదు.

సగటు మనుషుల్లో రాజారావు అతి సగటు మనిషి. రాజారావులాంటి మనుషులు జీవితంతో రాజీపడి బతికేయగలరే తప్ప తిరగబడరు తిరుగుబాటు పేరుచెప్తే వాళ్ళకి కాళ్ళూ చేతులూ ఆడవు. ఈసంగతి సుబ్బారావుకి తెలుసు.

"అదేకాదు. ఖాన్ దగ్గర యెప్పుడూ కత్తి వుంటుంది. నీకు తెలుసుగా కాబూలీవాళ్ళు దేనికైనా తెగిస్తారు. ఆలోచించు. తెగించ గలిగావా ఒక్క దెబ్బతో ఖాన్ బెడద వదిలిపోతుంది. నువ్వో, ఖానో తేలిపోతుంది."

రాజారావు అరిచేతులు తడిసిపోయాయి, గుండెల్లో భయం కళ్ళల్లో నీళ్ళు ఆవిర్లుగా మారుతోంది. అతనికి కూర్చోడంకష్టంగా వుంది.

రాజారావుని సిగరెట్టు పొగమధ్యనుంచి చూస్తున్నాడు సుబ్బారావ్.

"చూడు రాజారావ్. నీలాంటివాళ్ళు ధైర్యం చెయ్యలేరు. ధైర్యం చెయ్యలేనప్పుడు అనుభవించవలసిందే."

"అదికాదండిసుబ్బారావుగారూ. ఖాన్‌ని చూస్తుంటేనే నాకు కాళ్ళూచేతులూ ఆడ

వంశీ" అన్నాడు రాజారావు ఎలాగో గొంతు పెగుల్చుకుని.

"అయితే ఏంచేద్దామని? ఖాన్ నీతోటే వదిలిపెడతాడని అనుకోకు. నీ తర్వాత నీ కుటుంబంమీద పడతాడు. ఆ తరువాత ఏం జరుగుతుందో నే చెప్పలేను. అందుకే అప్పు యిప్పించమని అడిగినప్పుడు నేను ముందే చెప్పాను— ఆలోచించుకోమని. నా మాట అప్పుడు అర్థం చేసుకోలేదు. ఇప్పుడు ఏం చెయ్యాలండి. అంటే నేనేం చెప్పను. అయినా నే చెప్పింది నువ్వు చేస్తావని ఏమిటి నమ్మకం" అన్నాడు సుబ్బారావు.

అప్పు అడిగినప్పుడు ఈ సుబ్బారావే కాబూలీ వాడి దగ్గర తీసుకోమన్నాడని, హామీ కావలిస్తే తానుంటానన్నాడని. భయపడాల్సిన అవసరం లేదన్నాడని— ఇవేవీ రాజారావుకి గుర్తు రాలేదు.

"ఖాన్‌తో ఘర్షణ తప్పించి మీరేం చెయ్యమన్నా చేస్తాను. సుబ్బారావుగారూ ఖాన్ అప్పునుంచి నాకు విముక్తి దొరికితే చాలు" అన్నాడు రాజారావు సుబ్బారావు చేతులు పట్టుకుని.

సుబ్బారావు కొంతసేపు మాట్లాడలేదు.

"నీకేమన్నా ఆస్తివుందా రాజారావ్."

"ఒక పెంకుటిల్లుంది మా వూళ్లో."

"అది అమ్మేశో లేకపోతే తాకట్టుపెట్టో. ఈ అప్పు తీర్చేయచ్చుగా"

"ఆ పని చెయ్యలేనండీ. ఈ సంగతి మా అమ్మగారికి. నాన్నగారికి తెలిస్తే వాళ్ళు తట్టుకోలేరు."

"పోనీ మీ ఆవిడ కేమైనా నగ లున్నాయా."

"ఒక్క గొలుసుందండి. ఈ విషయం దానికి తెలియదు. ఆ గొలుసు వాళ్ళ పుట్టింటివారు పెట్టింది. నే నింతవరకూ దానికి ఏమీ చేయించలేక పోయాను. వున్నదే ఒక్క గొలుసు. అది తియ్యలేనండీ" అన్నాడు రాజారావు బాధపడుతూ.

"మరెలాగండీ.... ఏదీ చెయ్యకపోతే ఖాన్ అప్పు ఎలా తీరుద్దామని" అని విసుక్కున్నాడు సుబ్బారావు.

"మీరు కోపగించుకోవద్దు సుబ్బారావు గారూ."

"కోపమంటా వేమిటోయ్. నువ్వు కటకపోతే వాడు నన్ను పట్టుకుంటాడు. నా హామీ ఏమీలేదని చెప్పేస్తావాడితో. నాకెందు కొచ్చిందీ గొడవ."

రాజారావు వణికిపోయాడు. "ప్లీజ్. ఏదైనా ఉపాయం మీరే చెప్పండి. మీరు చెప్పినవి తప్పించి మీరేం చెయ్యమన్నా చేస్తాను."

"ఈ విషయాల్లోనే ధైర్యం చెయ్య లేని నువ్వు మిగతా విషయాల్లో సాహసించగలనని ఎలా అనుకోను."

"కాదు. కాదు. చేస్తాను. మీరేం చెప్పినా చేస్తాను. ప్రతి నెలా ఈ నరకం అనుభవించేకంటే మీరు చెప్పిందేదైనా చేస్తాను."

"ఏమో. చెప్పాక మళ్ళీ ఏదో సాకు చెప్పవని ఏమిటి నమ్మకం" అన్నాడు సుబ్బారావు పెదవి విరుస్తూ.

"నే మాటిస్తున్నాను సుబ్బారావుగారూ.



మా వాళ్ళకి కష్టం కలక్కుండా ఏ పనైనా చేస్తాను" అన్నాడు రాజారావు ఆవేశంగా.

"ఇలా చూడు రాజారావ్— నీ కొచ్చే జీతంలో ఆఫీసు లోన్సు పోనూ మిగిలిన దాంట్లో ఈ అప్పు ఎప్పుడూ తీర్చలేవు. నిజమేనా?"

రాజారావు తలవూపాడు.

"ఈ అప్పు తీరాలంటే నీకేదైనా అకస్మాత్తుగా డబ్బు రావాలి. లేదా ఎవడైనా వడ్డీలేకుండా అప్పివ్వాలి. అలా అప్పిచ్చే వాళ్ళెవరైనా వున్నారా నీ దృష్టిలో"

రాజారావు సుబ్బారావుకేసి చూశాడు.

"ఎవరూ లేరు అవునా" రాజారావు కళ్ళల్లో కదిలిన ఆశని గమనించకపోలేదు సుబ్బారావు "నా దగ్గరుంటే తప్పకుండా ఇచ్చేవాడిని. నేను సర్దగలిగితే రెండు మూడు వందలు సర్దగలను- మరినీకు అకస్మాత్తుగా డబ్బు రావాలి. నీకు పేకాడటం వచ్చా"

రాదన్నట్టు తలవూపాడు రాజారావు.

"యూ హేవ్ టు గాంబుల్ అదొక్కటే మార్గం. అదికూడా డెఫినిట్‌గా లాభదాయకమై వుండాలి. యస్. అదొక్కటే సొల్యూషన్." అన్నాడు సుబ్బారావు. తనలో తను మాట్లాడుతున్నట్టు. అతని నోట్లోంచివచ్చే ప్రతిమాటను గట్టిగా పట్టుకోడాని కన్నట్టు కూర్చున్నాడు రాజారావు. "ఈ రోజు జీతం తీసుకున్నావుగా, జీతంతీసుకున్నట్టు ఇంటో చెప్పొద్దు. రేపు శనివారం ఆఫీసుకి సెలవుపెట్టి నాతోరా. యూకెన్ గో విత్ మినిమమ్ ఆఫ్ త్రీ. ఫోర్ థౌజండ్. ఓ. కె. రేపు చెప్తాను ఏం చెయ్యాల్సింది. ఇంక వర్రీ అవకు. పోదాం పద" అని లేచాడు సుబ్బారావు.

అయోమయంగావున్నా ధైర్యం తెచ్చుకుని సుబ్బారావు వెనకాల బయల్దేరాడు రాజారావు.

* * *

సుబ్బారావు చేసిన బోధకి బుర్ర తిరిగిన రాజారావు మర్నాడు అతనితో కలిసి చేతిలో మిగిలిన జీతం తీసుకుని రేసు కోర్సుకెళ్ళాడు. రాజారావే ఇద్దరికీ ఫస్ట్ ఎంక్లోజర్‌కి టిక్కెట్లు కొన్నాడు.

లోపలికి అడుగు పెట్టిన రాజారావుకి అతనిలాంటి వాళ్ళే చాలామంది కనిపించారు.

బుకీస్ దగ్గరకి సుబ్బారావుచే తీసికెళ్ళబడ్డ రాజారావు వుక్కిరిబిక్కిరయ్యాడు. తన ఊళ్లో సంతకన్నా వెయ్యిరెట్లున్న పెద్ద సంతలోకి వచ్చినట్టుగా వుందతనికి.

సుబ్బారావు గుర్రాలపేర్లు, జాకీలపేర్లు వాటిమీద పందాలు. ఏబుక్కీ ఎంత యిస్తున్నడో. ఏది ఫేవరెటో. ఏ గుర్రానికి గెలవడానికి అవకాశా లెక్కువ వున్నాయో చెప్తోంటే రాజారావుకి వైకుంఠపాళీ ఆడుతున్నట్టు, తనపావు అరుకానురుడి నోట్లో పడుతున్నట్టు అనిపించింది.

"పద రాజారావ్ గుర్రంమీద కాసే ముందు దాన్ని 'పాడక్'లో చూడాలి."

పాడక్‌లో గుర్రాలు గుండ్రంగా తిరుగుతున్నాయి. కొన్ని సాఫీగా నడుస్తున్నాయి. కొన్ని అసహనంగా గంతులేస్తున్నాయి.

"చూశావా రాజారావ్ ఆ ఎర్రగుర్రాన్ని అది ఎంత నీట్‌గా వుందో చూడు. దాని నెంబరెంత. ఆరు-రెడీ లైట్నింగ్. చూడవోయ్ దాని పెడిగ్రీ. దాని తండ్రి రెడ్ కిల్లర్. తల్లి రెడ్ లైట్. అవి యెంత గొప్ప గుర్రాలనుకున్నావు. పద దాని మీద కాద్దాం. నలభై అయిదు రూపాయలియ్యి అని రాజారావుని ఈడ్చుకుంటూ పరిగెత్తి. రాజారావిచ్చిన నలభై అయిదు రూపాయలు "రెడ్ లైట్నింగ్"మీద కాసి "పదవోయ్ గుర్రాలెళ్ళిపోయాయి" అని లాక్కెళ్ళాడు.

"దెస్టార్టెడ్"అని మైకులో అరుపు వినిపించింది.

ఇద్దరూ పరిగెత్తారు.

దూరంగా గుర్రాలు పరిగెడుతూ వస్తున్నాయ్.

గుర్రాలు దగ్గరవుతున్న కొద్దీ జనం అరుపులు ఎక్కువయ్యాయ్.

సుబ్బారావ్ జేబులో రుమాలు తీసి "కమానీ బోయ్. కమాన్ రెడ్ లైట్నింగ్ కమాన్"అని అరుస్తున్నాడు.

ఇంకా చాలామంది అరుస్తున్నారు.

రాజారావు తిమ్మిరెక్కినట్టు నుంచున్నాడు.

ఒక్కసారి రేసు కోర్సంతా రెడ్ లైట్నింగ్ అని అరిచింది.

సుబ్బారావు రాజారావు భుజం చరిచేస్తున్నాడు. చెయ్యి పట్టుకు వూపేస్తున్నాడు. కొంతసేపటిదాకా రాజారావు కేమీ అర్థం కాలేదు. ఆ తరవాత అతని మొహమ్మీద నవ్వు పుట్టింది. "థాంక్యూ— థ్యాంక్యూ సుబ్బారావ్" అన్నాడు.

బుక్కీ దగ్గరకెళ్ళి లైన్లో నిలబడ్డారు. వంద రూపాయలొచ్చాయ్. లైన్లోంచి ఇవతలికొచ్చాక "ఇదిగో రాజారావ్" నీ ఇన్వెస్టిమెంట్ ఫార్టీఫైవ్ ప్రాఫిట్ చెరిసగం—ట్వంటీ సెవెన్ ఫిఫ్టీ. కమాన్" అన్నాడు సుబ్బారావ్.

జేబులోంచి ఒరిజినల్ వెల్ పుసకం తీసి తిరగేశాడు. సుబ్బారావు పాడక్‌లోకి వెళ్ళి గుర్రాల్ని చూశారు.

"వీల్ ఆఫ్ ఫార్చ్యూన్ ఛాన్సెస్ బాగున్నాయి. దీంతో నీ ఫార్చ్యూన్ అందుకోవాలి...రా" అన్నాడు సుబ్బారావు. అతని వెంట హుషారుగా నడిచాడు రాజారావు.

"సీలక్ బాగుంది. ఇది బిగినర్స్ లక్. ఈరోజు నువ్వే నాకు బేంకర్‌వి. కమాన్" అన్నాడు సుబ్బారావు.

సుబ్బారావుతోపాటు రాజారావుకూడా అరిచాడు. "కమాన్ కమాన్ ఫార్చ్యూన్" అంటూ.

గుర్రాలు పరిగెడుతున్నాయో, గాల్లో తేల్తున్నాయో అన్నట్టుగా వచ్చాయి.

రాజారావుకి కళ్ళమ్మట నీళ్ళొచ్చాయి.

"వీల్ ఆఫ్ ఫార్చ్యూన్" జాకీని కింద పడేసి పరుగెత్తుకొచ్చింది.

"అధైర్యపడకూడదోయ్ నెక్స్టుటైమ్ బెటర్‌లక్. నేనున్నగా "రా" అన్నాడు సుబ్బారావు.

సాయంత్రం ఆరున్నరకి రాజారావు, సుబ్బారావు రేసు కోర్సుదాటి ఇవతలకొచ్చారు. రాజారావు టైఫాయిడ్ రోగిలా వున్నాడు. అతనికి అడుగులు పడుతున్నాయో, నేలమీద ఈడుస్తున్నాయో తెలియటంలేదు. సుబ్బారావు ఆటో పిలిచి అందులోకి రాజారావుని ఎక్కించి తనూ కూచ్చున్నాడు. ఆటో "మంజూ" ముందు ఆగింది. సుబ్బారావే ఆటోడబ్బులుచెల్లించి రాజారావుని లోపలికి తీసికెళ్ళాడు.

బేరర్‌కి ఆర్డరిచ్చి "అలా నీరసపడతావేమిటోయ్, యిటువంటి టైమ్‌లో ధైర్యంగా వుండాలి. నేనూ మొదట్లో ఇలాగే బాధపడ్డాను. నవ్ అయామ్ పర్ఫెక్ట్. మళ్ళీ ట్రై చేద్దాం. డోన్ట్ లూజ్ హార్ట్" అన్నాడు సుబ్బారావు ముందుకి వంగి.

రాజారావుకి ఒంటిచుట్టూ చల్లగా ఐసు ముక్కల మధ్య మండుతున్నట్టుగా వుంది. అతని దగ్గర జీతంలో మిగిలింది నాలుగు రూపాయల చిల్లర. అంతక్రితం రోజు "జీతం ఈ వేళ రాలేదు" అని ముఖం మరోవైపు పెట్టి వరలక్ష్మితో చెప్పినప్పుడు ఇంతకన్నా ఎక్కువగా మంట చల్లగా ఒంటిని చుట్టుకుంది.

"ఇహ ఈ నెల జీతం రానట్టే" అని అనుకున్న రాజారావు టేబిల్ మీద మోచేతులు చుట్టి ముఖం దాచుకున్నాడు.

"అదేమిటి రాజారావు. జీతం పోయిందని బాధపడుతున్నావా. దానికంత ఖంగారు దేనికి, అవసరమయితే రెండు మూడు

వంకలు పెనద్దుతా అన్నాగా. కావలిస్తే తీసుకో. నెలకింత అని మెల్లిగా తీరుద్దువు గాని. కమాన్ ఛీరప్" అన్నాడు సుబ్బారావు అనునయంగా.

రాజారావు తలెత్తి సుబ్బారావునిచూసి సన్నగా నవ్వాడు.

బేరర్ టేబిల్‌మీద పెట్టిన రమ్ బాటిల్ ఓపెన్‌చేసి రెండుగ్లాసుల్లోనూపోసి అయిసు ముక్కల్ని వేస్తూ, "రాజారావ్ ఆఫ్టరాల్ యింతదానికే బెంబేలు పడితే ఎలా. కమాన్ ఛీర్స్" అంటూ గ్లాసుని రాజారావు ముందుకు తోశాడు సుబ్బారావ్.

రాజారావు సుబ్బారావుకేసి కన్నార్పకుండా చూస్తున్నాడు. అదే నవ్వు - అదే చలిమంట.

"దేనికైనా దేరీజె బిగినింగ్. కమాన్. చేకిట్-బీబ్రేవ్" అన్నారు సుబ్బారావు రాజారావుని సూటిగా చూస్తూ.

సుబ్బారావు కళ్ళల్లోకి చూస్తున్న రాజారావుకి మరొక క్షణముంటే ఏమవుతుందో అనిపించింది. అదే-అదే-చుట్టూ పురి విప్పుతున్నట్టు.......

కళ్ళు ఒక్కసారి గట్టిగా మూసుకున్నాడు "థేంక్స్ సుబ్బారావ్" అంటూ ఒక్క ఉదుటున బైటికి నడచాడు రాజారావ్ సన్నగా నవ్వుతూ చూశాడు సుబ్బారావ్. కానీ రాజారావు అడుగులు తనమీద పడుతున్నట్టుగా అనిపించింది. సుబ్బారావుకి. ప్చ్ అనుకుని భుజాలెగరేసి రమ్ సిప్ చేస్తూ బార్‌లో మిగిలిపోయాడు సుబ్బారావు.

రాజారావు మంటల్ని కప్పుకుంటూ ఇంటికి నడిచాడు.

ఇంట్లోకి అడుగుపెట్టి కుర్చీలో కూర్చున్న రాజారావుకి మంచినీళ్ళిస్తూ "ఏమండీ జీతాలు నిన్ననే యిచ్చారటగా" అంది వరలక్ష్మి.

"ఛీ వెధవగోల" అని గ్లాసు విసురుగా వరలక్ష్మి మీదికి విసిరివేసి, మంచంమీద వాలిపోయాడు రాజారావు.

బిత్తరపోయిన వరలక్ష్మి కన్నీళ్ళు ముఖంమీద పడ్డ మంచినీళ్ళతో కలిసిపోయాయి.

* * *

రాజారావుకి పడక అస్తవ్యస్తంగాఅతని లాగే వుంది. తల తిప్పి వరలక్ష్మి కేసి చూశాడు. ఎగిరిపడుతున్న ఆమెడొక్కలు కనిపించాయి. మంచంమీంచిలేచి వరలక్ష్మి పక్కలో కూర్చున్నాడు. మెల్లిగా నడుం మీద చెయ్యేసి "నన్ను క్షమించు వరం" అన్నాడు.

అతనికేసి విసురుగా తిరిగి, చెయ్యి పట్టుకొని "ఏమండీ ఏమయిందో నిజం చెప్పండి" ....

రాజారావు గొంతులో చిక్కుపడ్డ బాధని దీర్చుకుంటూ వరలక్ష్మి ఒళ్ళో తలపెట్టి కాబూలీవాడి అప్పు. సుబ్బారావు సంభాషణా. తన భయమూ. రేసుకోర్సూ అన్నీ చెప్పాడు.

వరలక్ష్మి చలనం లేకుండా వింది. మెల్లిగా రాజారావు ముఖాన్ని పైకెత్తింది. అతని కళ్ళలో సుడిగుండాలు చూసింది. తన మెడమీద చెయ్యేసి. గొలుసుతీసి అతని చేతిలో పెట్టి "ఆ కాబూలీవాడిని. ఆ సుబ్బారావునీ వదిలించుకోండి. చూడండీ మనకున్నవి ఈ రెక్కలే. వాటిని విరుచుకోకండి" అంది అతన్ని తన గుండెల్లోకి తీసుకుంటూ

రాజారావు అలాగే వరలక్ష్మిని. ఆమె కళ్ళలో గువ్వదీపపు వెలుగుల్ని చూస్తూ వుండిపోయాడు. ★


**WANTED**

**1. BANKING 2. ACCOUNTANCY**

**THREE MONTHS TRAINING**

Bank లందు. ప్రభుత్వ. వాణిజ్య శాఖలందు Accountants, Bank Clerks, Cashiers, Junior Assistants ఉద్యోగములు పొందుటకు ప్రభుత్వమువారిచే నిర్వహించు పరీక్షలకు స్త్రీ. పురుష అభ్యర్థులకు శిక్షణ ఇవ్వబడును. శిక్షణాకాలములో ప్రతి అభ్యర్థికి రు. 150/- Scholarship ఇవ్వబడును. ఉత్తీర్ణులైన అభ్యర్థులు నెలకు రు 450/- 680/- వరకు జీతమును పొందుటకు అర్హులు. ఉచిత Hostel వసతులు లభించును

విద్యార్హతలు : S. S. C. or Inter or Degree.

Application form, Prospectus కొరకు రు. 3/- M. O. లేక Crossed Postel Order పంపి పొందవచ్చును.

N. B. : పోస్టులు మూలముగా కూడా శిక్షణ పొందవచ్చును.

**Principal. Technical Examinations Training College**

**P. H. ROAD, KOYAMBEDU, MADRAS-602 102.**



చిత్రకళ



స్థాపితం. 1957 ఫోన్ నెం. 846186

మీరు మీ ఇంటియందుండే తపాల పాఠముల ద్వారా చిత్రకళ నేర్చుకొని రెండు సంవత్సరములలో ఉత్తమచిత్రకారులు కావచ్చును. యావద్భారత దేశము నుండియు విదేశముల నుండియు అనేకమంది మావిద్యాలయములో విద్యార్థులుగాచేరి ఉత్సాహంతో శిక్షణ పొందుచున్నారు

మీరు కూడా ఈ సులభపద్ధతులలో చిత్రకళ నభ్యసించుటకు సమ్మతించుచున్నారా? వివరములకొరకు తొమ్మిది పదిపైసల స్టాంపులను పంపండి

SANTHANU'S CHITRA VIDYALAYAM. (J)

179, Singanna Chetty St. Chintadripet, MADRAS-2.